# వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం

- రాజన్న ఆలయంలో నేడు గీతా జయంతి, రేపు ముక్కోటి ఏకాదశి
- ఆలయ ఈవో కృష్ణప్రసాద్


అనంతపద్మనాభ స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, డిసెంబర్ 21: వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం గీతాజయంతి, శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు గీతాజయంతి ఉత్సవాల సందర్భంగా స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు దేవతామూర్తులకు ప్రత్యేక అర్చనలు చేయనున్నట్లు వెల్లడించారు. 24న ప్రధాన దేవతామూర్తులకు ప్రత్యేక అర్చనలు, పారాయణాలు, ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. 23న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం 3నుంచి 3.10గంటల వరకు మంగళవాయిద్యాలు, 4.20గంటలకు సుప్రభాత దర్శనం, 4.30 నుంచి 5.45గంటల వరకు ప్రాతఃకాలపూజ, 5.50గంటల నుంచి పల్లకీ సేవ ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని చెప్పారు. ఆలయ ముందుభాగంలో వేదపండితులతో స్వస్తి వచనం, ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని సందేశాలు, హారతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

### స్వామివారికి ప్రత్యేకపూజలు

రేవతి నక్షత్రం సందర్భంగా వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామివారికి గురువారం స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ప్రాతఃకాల పూజల అనంతరం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ అనంత పద్మనాభ స్వామివారికి అభిషేక పూజలు చేశారు. ఇక్కడ ప్రతాప శ్రీనివాస్, దుమాల నాగరాజు, దేవరాజు భాస్కర్, గణేశ్, వేద పండితులు శ్రీధర్, నందు ఉన్నారు.

## రాజన్న సన్నిధిలో జడ్పీ చైర్‌పర్సన్ అరుణ

వేములవాడ రాజన్నను గురువారం జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ-రాఘవరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. చైర్‌పర్సన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు వారిని ఆశీర్వదించగా, ఉప ప్రధాన అర్చకుడు నమిలకొండ రాజేశ్వరశర్మ వారికి స్వామి వారి ప్రసాదం అందించారు.

జడ్పీ చైర్‌పర్సన్ దంపతులకు ప్రసాదం అందిస్తున్న ఉప ప్రధాన అర్చకుడు

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ర్యాలీగా వెళ్తున్న భక్తులు

## రాములోరి అక్షింతలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 21: అయోధ్య శ్రీ రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో రాములోరి అక్షింతల ఊరేగింపు కార్యక్రమాన్ని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయం నుంచి సత్సంగ సదనం వరకు భక్తిగీతాలను ఆలపిస్తూ కదిలారు. ఇక్కడ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

## దేశాయిపల్లెలో బైక్ దగ్ధం

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 21: తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లెకి చెందిన మ్యాకల చంద్రయ్య బుధవారం రాత్రి తన ఇంటి ముందట బైక్ పార్క్ చేశాడు. ఈ క్రమంలో దుండగులు బైక్‌కు నిప్పటించడంతో మంటలు చేలరేగాయి. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి మంటలను ఆర్పివేయగా, అప్పటికే బైక్ పూర్తిగా దగ్ధమైంది. గురువారం పోలీసులు విచారణ చేపట్టారు.

## పథకాలపై అవగాహన

రుద్రంగి, డిసెంబర్ 21: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్రం అమలు చేస్తున్న పథకాలపై గురువారం మానాలలో గ్రామస్తులకు ఎంపీడీ వో శంకర్ అవగాహన కల్పించారు. ఇక్కడ వైస్ ఎంపీపీ భూమయ్య, సర్పంచ్ మానస, అధికారులు, తదితరులు ఉన్నారు.

## నేడు మండల సమావేశం

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 21: తంగళ్లపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 22న నిర్వహిస్తున్నామని ఎంపీడీవో లచ్చాలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే సమావేశానికి సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. చివరి సమావేశం కానున్నందున అన్ని గ్రామాల సర్పంచులకు జ్ఞాపికలను అందించి, ఆత్మీయ సత్కారం చేయనున్నట్లు తెలిపారు.

## పాఠశాల అభివృద్ధికి విరాళం

కోనరావుపేట, డిసెంబర్ 21: విద్యా బుద్ధులు నేర్పిన కనగర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు రావులపల్లి గంగారెడ్డి, పరుశురాం, బత్తుల రవి రూ.5వేల విరాళం అందించారు. ఇక్కడ హెచ్ఎం వినోద్ కుమార్, సర్పంచ్ అనుపాటి భారతి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## తిమ్మాపూర్ వాసికి డాక్టోరల్ ఫెలోషిప్

ఎల్లారెడ్డిపేట, డిసెబర్ 21: తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సంద్ర రవికుమార్ జాతీయ పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ అందుకున్నట్లు గ్రామస్తులు గురువారం తెలిపారు. అర్థశాస్త్రంలో నెట్, స్లెట్ సాధించడమే కాకుండా డాక్టరేట్ పట్టానూ అందుకున్నారు. బుధవారం జాతీయ పోస్ట్ ఫెలోషిప్‌కు అర్హత సాధించడంతో గ్రామస్తులు రవికుమార్‌ను అభినందించారు.

## ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసులో ముగ్గురికి మూడేళ్లు జైలు

గాంధీచౌక్, డిసెంబర్ 21: ఆర్టీసీ కాంట్రాక్ట్ డ్రైవర్‌పై దాడి కేసులో ముగ్గురికి మూడేండ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికీ ₹5వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 11మే 2015న ఆర్టీసీ ఉద్యోగులు తమ వేతనాల పెంపుపై నిరవధిక సమ్మె చేయడంతో తంగళ్లపల్లి మండలం పెద్దలింగాపూర్‌కు చెందిన సలెంద్రి గోపి కాంట్రాక్ట్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తించాడు. ఈ క్రమంలో గోపి అదే రోజున సిరిసిల్ల డిపోకు చెందిన బస్సును నడుపుతుండగా, ఆర్టీసీ డ్రైవర్లు లకావత్ రాంరెడ్డి, సత్యనారాయణరావు, మాలోత్ మదన్ ముగ్గురు కలిసి బస్సును ఎందుకు నడుపుతున్నావంటూ కోపంతో దాడి చేశారు. ఈ ఘటనలో గోపి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరపున చలిమెల సందీప్ వాదించగా, కోర్టు కానిస్టేబుల్ వేములనరేశ్ ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్, నిందుతులు ముగ్గురిపై నేరం రుజువు కావడంతో జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## 29న యువజనోత్సవాలు

గంగాధర, డిసెంబర్ 21: కరీంనగర్ జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 29న జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జాతీయ యువజన అవార్డు గ్రహీత రేండ్ల కళింగ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్ స్టేడియంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. బృంద, వ్యక్తిగత విభాగాల్లో జానపద నృత్యం, గీతం, కథా రచన, పోస్టర్ మేకింగ్, ప్రకటన, ఫొటోగ్రఫీ అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. 15 నుంచి 29 ఏళ్ల యువత ఆధార్ కార్డు, పదో తరగతి మెమో, జనన ధ్రువీకరణ పత్రంతో బయోడేటాను కరీంనగర్ యువజన సర్వీసుల కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 99498 50360, 96409 67943, 89852 75068 లో సంప్రదించాలని సూచించారు.

## 24న ఎంపిక పోటీలు

కొత్తపల్లి, డిసెంబర్ 21: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 24న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ బాలబాలికల జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు జనన ధృవీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

## హాకీ పోటీలకు ఎంపిక

తిమ్మాపూర్ రూరల్, డిసెంబర్21: ఎల్ఎండీ కాలనీలో గల శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సెకండియర్ విద్యార్థి రాజ్‌కుమార్ అంతర్ యూనివర్సిటీ హాకీ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో తమిళనాడులో భారతీదాసన్ యూనివర్సిటీలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల హాకీ పోటీలో జేఎన్టీయూ టీం తరుపున రాజ్‌కుమార్ పాల్గొననున్నాడని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. గురువారం రాజ్‌కుమార్‌కు ఆర్థిక సాయం అందిస్తూ పుష్పగుచ్ఛంతో పాటు ట్రాక్ సూట్ బహూకరించారు.

## ఆర్థిక స్వావలంబన సాధించాలి

అగ్రహారం డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుజాత

వేములవాడ రూరల్, డిసెంబర్ 11: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు. గురువారం వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో బ్యూటీ, కాస్మటాలజీ కోర్సును ఆమె ప్రారంభించారు. కళాశాలలో మూడు నెలల బ్యూటీ, కాస్మటాలజీ కోర్సు 2వ బ్యాచ్‌ని రోజా ఇండస్ట్రీస్ చైర్మన్ సాక శైలజ సహకారంతో ప్రారంభించడం అభినందనీయమని కొనియాడారు. ఇక్కడ ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, రోజా ఇండస్ట్రీస్ డైరెక్టర్, చైర్మన్ సాక శైలజ, కోఆర్డినేటర్ ఎం రమాదేవి, సహ కోర్డినేటర్ కరుణ, వైస్ ప్రిన్సిపాల్ తిరుకోవెల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## శుభకార్యానికి హాజరైన కొండూరి

నామకరణ మహోత్సవంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

గంభీరావుపేట, డిసెంబర్ 21: గజసింగవరంలో నామకరణ మహోత్సవానికి గురువారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు హాజరయ్యారు. గ్రామానికి చెందిన అక్రోజు శిరీష్-దీప్తి దంపతుల కుమారుడి నామకరణ మహోత్సవంలో కొండూరి రవీందర్‌రావు, నాయకులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

### డిగ్రీ కళాశాల విద్యార్థికి సిల్వర్ మెడల్

విద్యార్థి వేణును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

తెలంగాణ చౌక్, డిసెంబర్ 21: శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన యూనివర్సిటీ స్థాయి క్రీడా పోటీల్లో వికాస్ డిగ్రీ కళాశాల విద్యార్థి అననేని వేణు (బీకాం ఫస్టియర్) అథ్లెటిక్స్‌లో (లాంగ్ జంప్) ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా వేణును ప్రిన్సిపాల్ దిడ్డి శ్రీనివాస్ అభినందించి, సత్కరించారు. ఇక్కడ వైస్ ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, అజీమ్, అధ్యాపకులు ఉన్నారు.

## వివాహ వేడుకకు హాజరు

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 21: తెలంగాణ జాగృతి తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్ కూతురు వివాహ వేడుకకు ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వేడుకల్లో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జాగృతి జిల్లా అధ్యక్షుడు జూపల్లి నాగేందర్ రావు, ఎంపీపీ పడిగెల మానస, సీనియర్ నేత బొల్లి రామ్మోహన్, పార్టీ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, జడ్పీటీసీ మంజుల, పీఏసీఎస్ చైర్మన్లు దేవదాస్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటరమణారెడ్డి, పడిగెల రాజు, సర్పంచ్ అనిత, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకట్రావు, నాయకులు అంతయ్య, తిరుపతి, బండి జగన్ ఉన్నారు.

వధూవరులను ఆశీర్వదిస్తున్న సెస్ చైర్మన్ రామారావు, నాయకులు

## రాష్ట్రస్థాయి పోటీలకు 'కనగర్తి' విద్యార్థి ఎంపిక

బత్తుల వాసు

కోనరావుపేట, డిసెంబర్ 21: కనగర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బత్తుల వాసు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ అజయ్ తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో అండర్-18 విభాగంలో ఆరు కిలోమీటర్ల రన్నింగ్ పోటీలో ద్వితీయ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. ఈ నెల 23న కామారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థిని హెచ్ఎం వినోద్‌కుమార్, సర్పంచ్ అనుపాటి భారతి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ అభినందించారు.

## విజయంతం చేయండి

ఇల్లంతకుంట, డిసెంబర్ 21: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలోని సాయిరాం గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించే బీఆర్ఎస్ మానకొండూర్ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని విజయంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్, జీవీ రామకృష్ణారావు హాజరవుతారని తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పీఏసీఎస్, ఏఎంసీ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## సాయినగర్‌లో చోరీ

వేములవాడ, డిసెంబర్ 21: పట్టణంలోని సాయినగర్‌కు చెందిన కృష్ణారావు తరుచూ పని నిమిత్తం వేములవాడ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఇటీవల అతడి స్నేహితులు వేములవాడకు రాగా, వారు ఉండేందుకు తన ఇంటిని ఇచ్చాడు. వారు తిరిగి వెళ్లిన తర్వాత గురువారం కృష్ణారావు ఇంటికి వచ్చాడు. తలుపులు తీసి ఉండడం, ఇంట్లోని సామగ్రి చిందరవందరగా ఉండడంతో పోలీసులకు సమాచారం అందించాడు. నాలుగు తులాల బంగారం, రెండు కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఓటరుగా నమోదు చేసుకోవాలి

- తహసీల్దార్ గణేశ్
- మండల పరిషత్‌లో బీఎల్‌వోలకు శిక్షణ

బీఎల్‌వోలకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్ గణేశ్‌వెంకటరమణ

ముస్తాబాద్, డిసెంబర్ 21: రానున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ గణేశ్ సూచించారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలకు గురువారం శిక్షణ నిర్వహించారు. మండలంలో 18 సంవత్సరాలు నిండిన వారందరినీ ఓటరుగా నమోదు చేయాలని ట్రైనర్ గణేశ్ వెంకటరమణ బీఎల్‌వోలకు సూచించారు. నమోదు ప్రక్రియను ఇచ్చిన సమాయానికి పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, అధికారులు, బీఎల్‌వోలు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రెస్‌ల పంపిణీ

ముస్తాబాద్, డిసెంబర్ 21: గూడెం గ్రామానికి చెందిన చిట్నేని మాధవివెంకటేశ్వర్‌రావు, విద్యాసాగర్ గురువు శివనందమూర్తి జన్మదినం సందర్భంగా చిప్పలపల్లిలో 12 మంది నిరుపేద విద్యార్థులకు డ్రెస్‌లు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కొమ్మటి రాజమల్లు నిరుపేద విద్యార్థులకు గురువారం డ్రెస్‌లు పంపిణీ చేశారు. ఇక్కడ సర్పంచ్ జ్యోతి ఎల్లం, మాజీ సర్పంచ్ గాడిచెర్ల దేవయ్య, ఎస్ఎంసీ చైర్మన్ చిలివేరి స్వామి, మాధవరెడ్డి, బాపురెడ్డి, అమర్, సతీశ్, పోచయ్య, లింగం, బాలకొమురయ్య, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

# రోడ్ల మీదికే దుకాణాలు

- రాజన్న భక్తులకు కాలినడకే కష్టం
- అధికారులు పట్టించుకోవాలని కోరుతున్న పట్టణ ప్రజలు

వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్‌లో రోడ్డు మీదికి వచ్చిన దుకాణాలు

వేములవాడ, డిసెంబర్ 18: వేములవాడ రాజన్న ఆలయ వాణిజ్య సముదాయాల అద్దె జానెడు అయితే.. వ్యాపారం రోడ్డు మీదికి మూరెడు వచ్చి చేస్తున్నట్లుంది. అరకొర సందులు, నిత్యం భక్తుల రద్దీ కావడంతో రోడ్డు మీద నడవడానికి ఇబ్బందిగా మారి రాజన్న సన్నిధికి వచ్చిన భక్తులు అష్టకష్టాలు పడుతున్నారు. మరో వైపు దుకాణాలను లీజుకు పొందిన వ్యాపారులు, గుత్తేదారులు మరొకరికి సబ్ లీజుల వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వారు రహదారులను ఆక్రమించుకొని వ్యాపారాలు చేస్తున్నట్లు విమర్శలున్నాయి. అధికారులు పట్టించుకోవాలని భక్తులు కోరుతున్నారు.

### దుకాణాలు వదిలి రహదారిపై వ్యాపారం

రాజన్న ఆలయ సమీపంలో అద్దె ప్రతిపాదికన పొందిన సముదాయాల్లో వ్యాపారులు దుకాణాలను వదిలి రహదారులపై వ్యాపారం చేస్తున్నారు. జాతర గ్రౌండ్‌లో ఇప్పటికే నిబంధనలు విస్మరిస్తూ మాంసం విక్రయాలు జరుపుతున్నారు. ఇదిలా ఉండగా ఒక్కో వ్యాపారి సుమారు 10 అడుగులకు పైగా రహదారిని ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. రాజన్న సన్నిధిలో రద్దీగా ఉండే ఆది, సోమ, శుక్రవారాల్లో కనీసం నడవడానికి కూడా రహదారి లేకుండా ఉండడంతో భక్తులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

### లీజులో.. సబ్ లీజులు

వేలంపాటల ద్వారా హక్కులు దక్కించుకున్న వ్యాపారులు, గుత్తేదారులు రాజన్న వాణిజ్య సముదాయాల్లో అక్రమ సబ్ లీజులకు వ్యవహారానికి తెరలేపారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి క్యాంపు కార్యాలయం కిందే ఉన్న పాత విచారణ కార్యాలయాన్ని హక్కులు దక్కించుకున్న సదరు గుత్తేదారు రహదారిని సైతం అద్దెకు ఇచ్చారు. పాత విచారణ కార్యాలయం ముందు గల స్థలాన్ని కూడా అద్దెకు ఇచ్చి సబ్ లీజు వ్యవహారాన్ని నడుపుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

### అద్దె నిధులతో కోట్లలో ఆదాయం

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి అద్దె గదులతోపాటు అద్దె వాణిజ్య సముదాయాలు కూడా ఉన్నాయి. వేలం పాట ద్వారా అద్దె ప్రతిపాదికన రాజన్న ఆలయ అధికారులు వ్యాపారులు, గుత్తేదారులకు కేటాయిస్తుంటారు. ఇక వీటి ద్వారా సుమారుగా ₹6 నుంచి ₹7కోట్ల ఆదాయం స్వామి వారికి సమకూరుతోంది.

### విస్తీర్ణాన్ని చూసే లీజులు ఇస్తాం

స్వామివారికి సంబంధించిన వాణిజ్య సముదాయాల్లో విస్తీర్ణం చూసే వేలంపాట ద్వారా హక్కులు అప్పగిస్తున్నం. సబ్ లీజుల వ్యవహారం మా దృష్టికి రాలేదు. అద్దె బాకీ ఉంటే మాత్రం తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పరిశీలించి వసూలు చేసుకుంటున్నం. భక్తులకు ఇబ్బంది కలిగేలా ఉంటే తగిన చర్యలు తీసుకుంటం.

– గోలి శ్రీనివాస్, పర్యవేక్షకుడు, రాజన్న ఆలయం

### రహదారులను ఆక్రమిస్తే చర్యలు

పట్టణంలో ఏ వ్యాపారి అయినా రహదారులను ఆక్రమిస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటం. ప్రతి ఏడాది రహదారులను ఆక్రమించుకున్న వారిపై జరిమానాలు విధించి వసూలు చేస్తున్నం. నడక రహదారులు లేకుండా ఆక్రమణలకు గురైన ప్రాంతాలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటం.

– అన్వేశ్, మున్సిపల్ కమిషనర్ (వేములవాడ)

### నిబంధనలు పాటించేలా చూస్తాం

భక్తులకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు చేసుకోవాలి. ప్రధాన రహదారులు జాతరగ్రౌండ్, రాజన్న ఆలయ పరిసరాల్లో వ్యాపారాలు చేసే వారితో సమావేశం నిర్వహించి నిబంధనలు పాటించే విధంగా చూస్తాం. రహదారుల మీదికి వచ్చి వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటం.

– కరుణాకర్, పట్టణ సీఐ (వేములవాడ)

## వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న స్వాములు, భక్తులు

రుద్రంగి, డిసెంబర్ 21: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో పడిపూజను గురుస్వామి శ్రీ చక్రవర్తుల పురుశోత్తమ చారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సతీమణి ఆది వనజ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎంపీపీ గంగం స్వరూపారాణి, సర్పంచ్ తర్రె ప్రభలత హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ ఎంపీటీసీ మంచె లావణ్య, నాయకులు గంగం మహేశ్, అల్లాడి రమేశ్, తర్రె మనోహర్, మంచె రాజేశం, మాడిశెట్టి ఆనందం, దయ్యాల కమలాకర్, బండారి నర్సయ్య, బాబా, మ్యాకల రాజేందర్, మాడిశెట్టి అభిలాష్, శ్రీనివాస్ ఉన్నారు.

## జిల్లాస్థాయి పాలిటెక్నిక్ సృజన్ టెక్ ఫెస్ట్

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

వేములవాడ రూరల్, డిసెంబర్ 21: వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ సృజన్ టెక్ ఫెస్ట్-2023 (ఎలక్ట్రికల్, టెక్స్‌టైల్, సీసీపి విభాగాలకు సంబంధించి) నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రాజగోపాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. అనంతరం సృజన టెక్‌ను సిరిసిల్ల జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఇక్కడ అధ్యాపకులు మల్లారెడ్డి, కణ్ణన్, రమేశ్, శ్రీదేవి, ప్రభాకరచారి ఉన్నారు.

## ముందస్తు గణిత దినోత్సవం

ఆవునూరు పాఠశాలలో గణిత దినోత్సవ సంబురాలు

ముస్తాబాద్, డిసెంబర్ 21: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గురువారం ఆవునూరు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ముందస్తు గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. సంబురాల్లో భాగంగా సర్కిల్(వృత్తము) ఆకృతిలో విద్యార్థులు నిల్చొని ప్రార్థనలు చేశారు. ఈనెల 22న శ్రీనివాసరామానుజన్ జయంతి సందర్భంగా వారం నుంచి మ్యాథమెటిక్స్ సంబురాలు నిర్వహిస్తున్నామని గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు నల్ల పరశురాములు తెలిపారు. మండల స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు సాత్విక, తులసీప్రసన్న, చైతలికి సర్టిఫికెట్లు అందించారు. పాఠశాల ఇన్‌చార్జి శారద విద్యార్థులకు గణిత సేవలను వివరించారు. ఇక్కడ ఉపాధ్యాయులు కవిత, విశ్వనాథ్, మనోహర్, ప్రభాకర్, పీఈటీ సురేశ్, విద్యార్థులు ఉన్నారు.

## కందికట్కూర్‌లో మహా పడి పూజ

కందికట్కూర్‌లో హోమం నిర్వహిస్తున్న మాలాధారులు

ఇల్లంతకుంట, డిసెంబర్ 21: కందికట్కూర్ గ్రామంలో గురువారం అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అయ్యప్పస్వాములు గ్రామంలో శోభాయాత్ర, మహా పడిపూజ, హోమం చేశారు. మహా పడిపూజలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## మక్క సాగుపై రైతులకు అవగాహన

కొత్తపల్లి, డిసెంబర్ 21: కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలంలోని బద్దిపల్లి రైతు వేదికలో కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, అఖిల భారత మక్క పరిశోధన కేంద్రం సౌజన్యంతో గురువారం యాసంగిలో మక్క సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఇక్కడ శాస్త్రవేత్తలు ఉషారాణి, మధుకర్‌రావు, జిల్లా ఏరువ